క్లుప్తంగా

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో మార్చి 21 నుంచి రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని తెలిపారు. శనివారం ఈ మేరకు సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. ఆచార్య శారద మాట్లాడుతూ అందుబాటులోని సాంకేతిక పరిజ్ఞానం, వివిధ రంగాల్లో సాగుతున్న పరిశోధనలు, తద్వారా సామాజిక మార్పులపై సదస్సు జరుగుతుందని తెలిపారు.

పలువురు నేతలకు పరామర్శ

చంద్రగిరి : స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నేత మోహన్ తండ్రి ఆనందయ్య మరణించడంతో శనివారం వారి ఇంటికి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి వెళ్లి పరామర్శించారు. ఆనందయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శానంబట్ల గ్రామానికి చెందిన పార్టీ దివంగత నేత మణిరెడ్డి తల్లి శాంతమ్మ పార్థివదేహానికి అంజలి ఘటించారు. వారి కుటుంబీకులను ఓదార్చారు. కార్యక్రమంలో బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, శంకర్ యాదవ్, మాధవరెడ్డి, కోటేశ్వరరెడ్డి, మస్తాన్, పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

గంగమ్మ సేవలో హర్షిత్‌రెడ్డి



ఆలయంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ చినిగేపల్లెలోని గంగమ్మ తల్లిని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి దర్శించుకున్నారు. శనివారం ఆలయ శిఖర కలశ స్థాపన, ధ్వజ స్తంభం ప్రతిష్టలో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు సహదేవరెడ్డి, సింహాల విమలమోహన, స్థానిక నేతలు జయపాల్‌రెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ మద్యపానంపై నిషేధం



మాట్లాడుతున్న పోలీస్, రెవెన్యూ అధికారులు

చంద్రగిరి : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని సీఐ సుబ్బరామిరెడ్డి హెచ్చరించారు. శనివారం ఈ మేరకు తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ శేఖర్‌తో కలసి కావమ్మగుడి వీధి, మార్కెట్ యార్డు ప్రాంగణాలలో మందుబాబులు పడేసిన వ్యర్థాలను తొలగించారు. సీఐ మాట్లాడుతూ బహిరంగ మద్యపానం నిషేధించామని, ఎవరిపై పట్టుబడితే భారీ జరిమానాతోపాటు జైలుశిక్ష తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ మహేశ్వరయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరంగారి రమేష్ రెడ్డి, టీడీపీ నేత కుమార్ రాజా రెడ్డి, తుడా మాజీ డైరెక్టర్ బాలకృష్ణ మూర్తి పాల్గొన్నారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడికి నివాళి

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ బోడిరెడ్డిగారిపల్లెకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి కర్మక్రియలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి హాజరై వెంకటరమణారెడ్డి చిత్ర పటానికి నివాళులర్పించారు. ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, సర్పంచ్ సింహాల విమలమోహన, స్థానిక నేతలు శివప్రసాద్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, సుధాకర్ రెడ్డి, పీహెచ్ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సత్కారం



నరసింహులు దంపతులను సన్మానిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్ : ఆర్టీసీలో సుమారు 27 ఏళ్లపాటు విశేష సేవలందించి ఉద్యోగ విరమణ పొందుతున్న కండక్టర్ మొగరాల నరసింహులును శనివారం తిరుపతి బస్టాండ్ వద్ద ఘనంగా సత్కరించారు. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ విశ్వనాథం మాట్లాడుతూ నరసింహులు క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించారని కొనియాడారు. తోటి ఉద్యోగులకు కష్టం వస్తే సాయం చేసేందుకు ముందుండే వారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ జిల్లా పర్సనల్ ఆఫీసర్ షహజాద్, తిరుపతి డీఎం బాలాజీ, శ్రీకాళహస్తి డీఎం మునిచంద్ర, అలిపిరి డిపో అసిస్టెంట్ మేనేజర్ పుష్పలత, ఆర్టీసీ ఉద్యోగ సంఘం నేతలు అర్జునయ్య, సత్యనారాయణ, వీఆర్ కుమార్,సుబ్రమణ్యం నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో సత్తా చాటిన కేటీ రోడ్డులోని పాలిటెక్నిక్ విద్యార్థులను ప్రిన్సిపల్ ద్వారకనాథరెడ్డి శనివారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ గత నెల 28నుంచి 30వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించినట్లు వెల్లడించారు. టేబుల్ టెన్నిస్‌లో జి.రెడ్డి చరణ్ వెండి, 100 మీటర్ల పరుగు పందెంలో బి.బిందుశ్రీ కాంస్యం, రిలే పరుగు పందెంలో బి.బిందుశ్రీ, పి.మౌనిక, కె.హసీనాబీ, టి.భవ్య బంగారు పతకాలు సాధించినట్లు వివరించారు. కార్యక్రమంలో జనరల్ విభాగాధిపతి డాక్టర్ గౌరీశంకర్, పీడీ కె.రాజీవ్ పాల్గొన్నారు.

రోడ్డు ధ్వంసం..జర భద్రం!

రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుపతి వైపు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. పాపానాయుడుపేట సర్కిల్ నుంచి నారాయణ కళాశాల వరకు మరీ అధ్వానంగా తయారైంది. మోకాటి లోతు గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. శనివారం రాత్రి ఓ కారు గుంతలో పడడంతో చక్రం పూర్తిగా దెబ్బతింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అగచాట్లు పడాల్సి వచ్చింది.

– రేణిగుంట



నెట్టింటి ఘుమఘుమలు!



- వంటలకు యూట్యూబ్‌ను ఆశ్రయిస్తున్న యువత
- ఆన్‌లైన్‌లో చూస్తూ కర్రీస్ ప్రిపరేషన్
- ఇంటర్‌నెట్ సాయంతో నలభీములను తలపిస్తున్న బ్యాచ్‌లర్స్
- వెరైటీ వంటకాలకు తాము సైతం అంటున్న మహిళలు

హోటల్ భోజనంతో విసిగిపోయి.. హాస్టల్‌లో వడ్డించే రుచీ పచీ లేని ఆహారం తినలేక.. అమ్మ చేతి వంటను గుర్తు చేసుకుని గతంలో యువత కుమిలిపోయేది. జిహ్వ చాపల్యంతో లోలోపల నలిగిపోయేది. కర్రీస్ పాయింట్‌ల నుంచి కూరలు తెచ్చుకుని అరకొరగా తిని అర్ధాకలితో ఇబ్బందిపడేది. అయితే ఇప్పుడు ఆ పరిస్థితిలో పూర్తిగా మార్పు వచ్చింది. ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. ప్రధానంగా యూట్యూబ్ మాధ్యమం లక్షలాది మంది నలభీములను తయారు చేసింది. వంటలకు సంబంధించి వందలాది వీడియోలను అందించి బ్యాచ్‌లర్స్ తమ క్షుద్బాధను తీర్చుకునేందుకు సహకరిస్తోంది. ఎలాంటి వంటకం తయారు చేసుకోవాలన్నా క్షణాల్లో నేర్పించేస్తోంది. ఈ క్రమంలోనే పలువురు మహిళలు సైతం సరికొత్త వంటలను సిద్ధం చేసేందుకు యూట్యూబ్‌నే ఆశ్రయిస్తున్నారు. దేశవిదేశీ వెరైటీలను కిచెన్‌లోకి తీసుకువచ్చేస్తున్నారు. అద్భుతమైన రుచులను సులభతరంగా వండి వార్చేస్తున్నారు.

– తిరుపతి సిటీ

సంతృప్తితో పాటు టేస్టీ



ఉద్యోగ రీత్యా తిరుపతిలో ఒంటరిగానే ఉంటున్నాను. మాది గుంటూరు. మా అబ్బాయి చెన్నైలో ఎంటెక్ చేస్తున్నాడు. నేను మా అబ్బాయి కుటుంబానికి దూరంగా ఉంటున్నాం. గతంలో హోటల్స్‌లో తింటూ నెలకు రూ. 8వేలు చెల్లించేవాడిని. అక్కడ మసాలాలు ఎక్కువ ఉండడంతోపాటు నిత్యం అక్కడు వెళ్లి తినడం ఇబ్బందిగా ఉండేది. మా ఆవిడ సలహాతో స్వతహాగా యూట్యూబ్ చూసి వంట నేర్చుకున్నా. ప్రస్తుతం వెజ్, నాన్ వెజ్‌లో ఏ వంటనైనా అవలీలగా 15 నిముషాల్లో చేసేస్తున్నా. సొంతగా చేయడం వల్ల సంతృప్తితో టేస్టీగా కూడా వంటలు ఉంటున్నాయి. మా అబ్బాయి కూడా ఇదే ఫాలో అవుతున్నాడు.

– ఆర్.చంద్రశేఖర్ రావు, ప్రైవేటు ఉద్యోగి, తిరుపతి

రోజుకో వెరైటీతో..



మాది కర్నూలు. తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎంసీఏ చదువుతున్నా. హాస్టల్‌లో ఉంటే రిపీట్ కూరలే గతి. నలుగురు స్నేహితులతో కలసి రూమ్ తీసుకున్నాం. రైస్ కుక్కర్‌లో వండుకుని కర్రీస్ పాయింట్లలో కూరలు తెచ్చుకునేళ్లం. దీంతో ఖర్చుతో పాటు అంత క్వాలిటీ, క్వాంటిటీ ఉండడలేదు. దీంతో యూట్యూబ్‌లో డిఫరెంట్ వంటకాల తయారీ వీడియోలను వీక్షించి వంటకాలు చేసుకుంటున్నాం.

– పి.శివప్రసాద్, ఎంసీఏ విద్యార్థి, తిరుపతి

యూట్యూబ్ సాయంతోనే..



పాతకాలం వంటకాలపై నేటి తరం యువత అంతగా మోజు చూపడం లేదు. ఆహార పదార్థాల్లో వెరైటీ కోరుకుంటున్నారు, ఇంట్లో కూడా మా అమ్మాయి ఫలానా వంట వండు యూట్యూబ్‌లో ఫలానా వీడియో చూడు అంటూ సలహాలిస్తోంది. దీంతో అవి చేయక తప్పడం లేదు. బిర్యానీ, పులావ్, చికెన్, మటన్, ఫిష్ కర్రీస్‌తో పాటు ఉదయం టిఫిన్‌లోకి పచ్చడి తయారీకి సైతం యూట్యూబ్‌ను ఫాలో అవుతున్నా.

– కె.సులోచన, గృహిణి, తిరుపతి

ఏది కావాలంటే అది



ప్రైవేటు కళాశాలలో బీటెక్ చదువుతున్నా. హాస్టల్ భోజనం తినలేక బయట స్నేహితులతో కలసి అద్దె గృహంలో ఉంటున్నా. వంటకాలకు యూట్యూబ్ తప్పనిసరిగా చూడాల్సిందే. స్నేహితులందరం కలసి యూట్యూబ్‌ను వీక్షించి ఆరోజు మెను తయారు చేస్తాం. నోటికి ఏది టేస్ట్‌గా అనిపిస్తే ఆ వంట సిద్ధం చేసుకుంటున్నాం. ఐటమ్స్ ఏవైనా యూట్యూబ్ వీడియోలను ఫాలో అవుతూ వండుకుంటున్నాం.

– ఎస్.ప్రవీణ, బీటెక్ విద్యార్థిని, తిరుపతి

అమ్మ వంటను తలపించేలా...



మాది తిరుపతి. ఓ ప్రైవేటు కంపెనీలో నేను, మా భర్త ఇద్దరం ఉద్యోగాలు చేస్తున్నాం. గతంలో అమ్మ పలుమార్లు వంట నేర్చుకో అని ఎంత చెప్పినా అంత ఇంట్రస్ట్ చూపలేదు. వివాహం కావడంతో స్వతహాగా వండుకోవాల్సిన పరిస్థితి. నాకు కనీసం రసం పెట్టేది కూడా తెలియదు. అలాంటిది యూట్యూబ్ సహాయంతో చికెన్, మటన్, ఫిష్‌తో పలు రకాల వెరైటీస్ వండేస్తున్నా. అందరూ ఆశ్చర్యపోతున్నారు.

– ఆర్.శ్రావణలక్ష్మి, ప్రైవేటు ఉద్యోగి, తిరుపతి

తిరుచ్చిపై వెంకన్న విహారం



ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. అనంతరం శ్రీవారిని శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. దేవదేవేరుల ఉత్సవ మూర్తులకు వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం వేడుకగా ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార శోభితుడైన శ్రీనివాసుడు ఉభయ దేవేరులతో కలసి బంగారు తిరుచ్చిపై ఆసీనులై నాలుగు మాడవీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్‌బాబు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

కన్సల్టెంట్ల కడుపు కొట్టొద్దని వినతి

తిరుపతి సిటీ : ఎస్వీయూలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్స్‌ను తొలగించి వారి కడుపు కొట్టొద్దని ఎస్ఎఫ్ఐ నేతలు కోరారు. శనివారం ఈ మేరకు వీసీ అప్పారావుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు అక్బర్, అశోక్ కుమార్, ఉసిరికాయల అశోక్ కుమార్, నరేంద్ర, వినోద్, వీరేష్, బాల, రెడ్డి కుమార్ పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్ : భారతీయ విద్యాభవన్, శ్రీవేంకటేశ్వర విద్యాలయం ఆధ్వర్యంలో 9రోజులపాటు నిర్వహించనున్న పుస్తక ప్రదర్శన శనివారం ఇస్కాన్‌రోడ్డులోని క్రీడా మైదానంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా రామాయణ, మహాభారత, భాగవతం వంటి విశిష్ట గ్రంథాలను మంగళవాయిద్యాల నడుమ పల్లకిలో ఊరేగించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సుప్రీం కోర్టు విశ్రాంత జడ్జి బీఎన్ శ్రీకృష్ణ మాట్లాడుతూ భారతీయ వేదాలను, ఉపనిషత్తులు చదవడం ద్వారా దేశ చరిత్ర, సాహిత్యంపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో స్విమ్స్ సూపరింటెండెంట్ ఆర్‌వీ కుమా, రామకృష్ణమిషన్ ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద, భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు వేగవంతం



సూచనలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : నగరంలో సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని కార్పొరేషన్ కమిషనర్, స్మార్ట్ సిటీ ఎండీ మౌర్య ఆదేశించారు. శనివారం ఉదయం నగరంలోని సుబ్బలక్ష్మి కూడలి, రామానుజ కూడలి, లీలామహల్ కూడలి, తదితర ప్రాంతాల్లో సుందరీకరణ పనులు, గొల్లవానిగుంటలో క్రికెట్ స్టేడియం పనులు, నూతనంగా నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించారు.

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

నగరంలోని పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. శనివారం తుడా కార్యాలయంలో సిటీ లెవెల్ టాస్క్ ఫోర్సు కమిటీ సమావేశం నిర్వహించారు.

వెటర్నరీ వైద్య విద్యార్థుల మెరుపు సమ్మె

- గౌరవ వేతనం పెంచాలని డిమాండ్



వెటర్నరీ కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పీజీ, యూజీ విద్యార్థులు

తిరుపతి సిటీ: వెటర్నరీ వైద్య విద్యార్థుల గౌరవ వేతనం విషయంలో అధికారులు దారుణంగా వ్యవహరిస్తున్నారని, వెంటనే స్టైఫండ్‌ను పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా శనివారం కళాశాల ఎదుట ప్లకార్డులు చేతబూని న్యాయం చేయాలని నినదిస్తూ మెరుపు సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంబీబీఎస్ విద్యార్థులకు నెలకు రూ.27 వేలతో పాటు టీఏ, డీఏలు వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారని, ఇంటర్న్‌షిప్ చేస్తున్న బీవీఎస్సీ, ఏహెచ్ విద్యార్థులకు కేవలం నెలకు రూ.7 వేలు గౌరవ వేతనం చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. వెటర్నరీ వైద్య విద్యార్థులను ప్రభుత్వం చిన్నచూపు చూడడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయుర్వేదిక్, హోమియోపతి, బీడీఎస్ విద్యార్థులకు సముచిత గౌరవవేతనం ఇస్తున్నారని, తమ పట్ల వర్సిటీ అధికారులు వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరమన్నారు. ఎంబీబీఎస్ పీజీ విద్యార్థులకు నెలకు రూ.50వేలు స్టైఫండ్ ఇస్తుంటే, వెటర్నరీ పీజీ విద్యార్థులకు కేవలం రూ.9 వేలు ఇస్తున్నారని మండిపడ్డారు. వెంటనే గౌరవవేతనాన్ని రూ.30వేలకు పెంచి ఇంటర్న్‌షిప్ చేసే విద్యార్థులకు మౌలికవసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించని పక్షంలో విధులను బహిష్కరించి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం వీసీకి వినతి పత్రం సమర్పించారు. ఈ ధర్నాలో ఎస్వీ వెటర్నరీ కళాశాలకు చెందిన యూజీ, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి చెరువుల్లో డ్రోన్ సర్వే

- 8 చెరువుల్లో 70.91 ఎకరాల్లో సర్వే
- బ్యూటిఫికేషన్ కోసమేనా?

చెరువు	విస్తీర్ణం ఎకరాల్లో	సర్వే నం
శెట్టిపల్లి చెరువు	55.25	447
అన్న చెరువు	77.46	85
చెన్నాయగుంట	52.56	176
పాన్ చెరువు	49.40	84
కొరమేనిగుంట	32.20	140
పూలవానిగుంట	23.82	46
గొల్లవాని గుంట	29.04	78
మంగళం చెరువు	75.98	6

తిరుపతిలోని 8 చెరువులు- 395.71 ఎకరాలు విస్తీర్ణం



డ్రోన్ ద్వారా సర్వే చేస్తున్న దృశ్యం

ఆక్రమణలు ఉంటే స్వాధీనం చేసుకుంటాం



తిరుపతి నగరంలోని ఎనిమిది చెరువుల పరిధిలో ఆక్రమణలు ఉంటే తప్పకుండా వాటిని స్వాధీనం చేసుకుంటాం. ప్రధానంగా చెరువుల్లో ఆక్రమణలు ఉంటే వదిలి పెట్టేది లేదు. అనంతరం చెరువుల బ్యూటిఫికేషన్‌కు ప్రత్యేక చర్యలు చేపడుతాం.

-కేపీ భాగ్యలక్ష్మి, తహసీల్దార్, తిరుపతి అర్బన్

తిరుపతి అర్బన్: జిల్లాల పునర్విభజనలో భాగంగా 2022 ఏప్రిల్ నుంచి తిరుపతి నగరం జిల్లా కేంద్రంగా ఆవిర్భవించింది. దీంతో అప్పటి నుంచి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ స్థలాల ఆక్రమణల పరంపర కొనసాగుతోంది. ఈ క్రమంలో తిరుపతి అర్బన్ రెవెన్యూ అధికారులు చెరువుల్లో శనివారం నుంచి డ్రోన్ సర్వే చేపట్టడం చర్చనీయాంశమైంది. తిరుపతి నగర పరిధిలోని అన్న చెరువుతోపాటు శెట్టిపల్లి, చెన్నాయగుంట, పాన్ చెరువుతోపాటు మరో నాలుగు చెరువులకు సంబంధించి ప్రభుత్వ లెక్కల ప్రకారం 395.71 ఎకరాల విస్తీర్ణం ఉంది. అయితే అందులో ఇప్పటికే 20 నుంచి 30 శాతం స్థలాన్ని ఆక్రమించినట్లు తెలుస్తోంది. డ్రోన్ల సాయంతో సర్వేను మొదలుపెట్టారు. మరో నాలుగు రోజుల్లో సర్వే పూర్తి చేయనున్నారు.

చెరువులకు హద్దులు ఏర్పాటు

ఈ నెల 6వ తేదీకి సర్వే పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత చెరువులకు సరిహద్దులను స్పష్టంగా తెలిజేయనున్నారు. అవసరమైన మేరకు సర్వేరాళ్లు లేదా కంచె ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతున్నారు.

ఉచిత అక్షరాభ్యాసం రేపు

తిరుపతి కల్చరల్ : వసంత పంచమిని పురస్కరించుకుని సోమవారం రాముల వారి దక్షిణ మాడా వీధిలోని చిగోర ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో ఉచిత అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకుడు చిత్రపు హనుమంతరావు తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఉదయం 7 నుంచి 9.30 గంటల వరకు అంకురార్పణ, కలశ స్థాపన, సరస్వతీ హోమం, పూర్ణాహుతి జరిపించనున్నట్లు వెల్లడించారు. 9.45 గంటలకు అక్షరాభ్యాసం ప్రారంభమవుతుందని చెప్పారు. అలాగే ఉన్నత పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు బాసర సరస్వతీ క్షేత్రం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన కుంకుమ, అక్షింతలు, సరస్వతీ కంకణాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఆసక్తిగలవారు ఆదివారం సాయంత్రం లోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9985532447, 9396855826 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు సీఆర్‌కే శేషగిరిరావు, కుమార్, జయలక్ష్మి, లీలావతి పాల్గొన్నారు


టీటీడీ ఉద్యోగి సురక్షితం

తిరుమల : కుంభమేళాలో తప్పిపోయిన టీటీడీ ఉద్యోగి సుబ్రమణ్యం సురక్షితంగా ఉన్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు వెల్లడించారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రయాగరాజ్‌కు 25 కిలోమీటర్ల దూరంలో సుబ్రమణ్యం ఉన్నట్లు తెలిసిందని తెలిపారు. ఆయనకు వినికిడి లోపం ఉన్నందు వల్ల ఆచూకీ కనిపెట్టడం కాస్త ఆలస్యమైందని చెప్పారు. సుబ్రమణ్యం సురక్షితంగా ఉన్నట్లు తెలియడంతో ఆయన కుటుంబీకులు సంతోషం వ్యక్తం చేశారు. టీటీడీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి

చంద్రగిరి : పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై తొండవాడ సమీపంలో శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. వివరాలు.. పాకాల మండలం గాదంకికు చెందిన రవి(45) ఆటోలో తిరుపతికి వస్తుండగా మల్లవరం క్రాస్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో రవి అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటమి భయంతోనే అరాచకం



పోలీసు దౌర్జన్యంపై ఫొటోలు ప్రదర్శిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్ : కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో ఓటమి భయంతో కూటమి నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి సురేష్, స్థానిక నేత బత్తుల అరుణ్ యాదవ్ మండిపడ్డారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మెజారిటీ ఉందని, అందుకే కూటమి నేతలు దౌర్జన్యాలకు దిగుతున్నారని విమర్శించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ తిరుపతిలో తిష్టవేసి కుట్రలకు తెరతీశారని ఆరోపించారు. అందులో భాగంగా డిప్యూటీ మేయర్ అభ్యర్థి శేఖర్ రెడ్డి ఆస్తులను ధ్వంసం చేసేందుకు తెగబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మేయర్ శిరీష, పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త భూమన అభినయ రెడ్డితో పోలీసులు అప్రజాస్వామికంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి నేతలకు ప్రజలే బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

‘ఫీజు పోరు’ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హర్షిత్‌రెడ్డి తదితరులు

తిరుపతి రూరల్ : ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 5వ తేదీన నిర్వహించే ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పిలుపునిచ్చారు.శనివారం తుమ్మలగుంటలోని పార్టీ కార్యాలయంలో ఫీజు పోరు పోస్టర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ప్రభుత్వం మొత్తం రూ.3,900 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. దీంతో పేద విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు. జగనన్న ఆదేశాల మేరకు కలెక్టరేట్ వద్ద భారీ ఆందోళన చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నేతలు ఓబుల్ రెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, ప్రేమ్ కుమార్, యుగంధర్, చిలమంద హరికృష్ణ, సుకుమార్, ముని, చెంగల్ రెడ్డి, పార్థ సారథి, శశి, భానుకుమార్, వినోద్ కుమార్, సురేష్, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

శ్వేతపత్రం విడుదలకు డిమాండ్



భోజన నాణ్యతను ఆరాతీస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో నిధుల వినియోగంపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు వర్సిటీ ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి చంద్రనాయక్‌తో కలసి హాస్టళ్ల పరిశీలించారు. చలపతి మాట్లాడుతూ వర్సిటీ అధికారులు ఏసీ రూమ్‌లకే పరిమితమయ్యారని, విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. మెస్ బిల్లులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు నాణ్యమైన ఆహారం పెట్టలేని స్థితికి ప్రతిష్టాత్మక వర్సిటీని దిగజార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెస్‌లకు బియ్యం, గుడ్లు, చికెన్ నూనె, ఇతర సరుకుల సరఫరా కాంట్రాక్టులను కూటమి నేతలకే కట్టబెట్టారని ఆరోపించారు. వారు నాసిరకం సరుకులు సరఫరా చేస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. దీనిపై ఈ నెల 5వ తేదీన ఆందోళన చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో శివ, హరి పాల్గొన్నారు